క్లుప్తంగా

సామాజిక గ్రంథాలయాల ఏర్పాటు


యువతకు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం: జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రత్యేక చొరవతో మండలంలోని మండ, గుమ్మలక్ష్మీపురం గ్రామ సచివాలయాల్లో అభిలాష సామాజిక గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. గుమ్మలక్ష్మీపురంలో సర్పంచ్ గౌరీశంకరరావు బుధవారం ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. గ్రూప్–1,2 పరీక్షలతో పాటు టెట్, డీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ వంటి ఇతర పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

లుంబేసులో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం


భూమిపూజ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు గ్రామంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులకు సర్పంచ్ తోయక చిలకమ్మ, ఎంపీటీసీ మండంగి గౌరమ్మ బుధవారం భూమిపూజ చేశారు. లుంబేసు గ్రామంలోని ప్రతీ ఇంటికి తాగునీరు అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జలజీవన్ మిషన్ కింద రూ.12.75 లక్షలు మంజూరు చేశారన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సచివాలయం బూత్ కన్వీనర్ తోయక గోపాల్, వైస్ సర్పంచ్ రామారావు ఉన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు


విద్యుత్ లైన్ల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న సర్పంచ్, ట్రాన్స్‌కో అధికారులు

పాలకొండ రూరల్: రాన్నున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్యామ్‌సుందర్ తెలిపారు. మండలంలోని లుంబూరు సచివాయం పరిధి గరుగుబిల్లి గ్రామానికి బుధవారం 64 కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజల ఇబ్బందులు గుర్తించి సహకరించిన ట్రాన్స్‌కో అధికారులకు సర్పంచ్ ఉపేంద్ర కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ


సీతంపేట: మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి


భామిని: శ్రావణ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: మండలంలోని పత్తికగూడకు చెందిన మాజీ సర్పంచ్ పి.వెంకటరావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం పరామర్శించారు. వెంకటరావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

● **భామిని:** వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ కమిటీ కార్యదర్శి ఇళ్ల శ్రావణ్‌కుమార్ తల్లి పుష్పలత అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బుధవారం పరామర్శించారు. పుష్పలత చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి సంతాపం తెలియజేశారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచం, వైస్ ఎంపీపీ బోనగడ్డ ధర్మారావు, బి.ప్రసాదరావు, గేదెల మోహనరావు, బిల్లుమడ సర్పంచ్ ఎస్.రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

తీరిన రేషన్ వెతలు


రేషన్ పంపిణీ కోసం కేటాయించిన వాహనాలు

● ఇంటి వద్దకే రేషన్ సరుకుల బట్వాడా..
● గిరిపుత్రులకు తప్పిన అవస్థలు

పాలకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడప వద్దకే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందుతుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు, సేవల కోసం పనులు మానుకుని ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సిఫార్సులు లేకుండా పథకాలు అందే పరిస్థితి లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన గ్రామ వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలతో ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు, సేవలు అందుతున్నాయి.

పడిగాపులకు ఫుల్‌స్టాప్..

గతంలో రేషన్ సరుకుల కోసం పౌరసరఫరా దుకాణం వద్ద గంటల తరబడి పడిగాపులు


క్షేత్రస్థాయిలో అర్హుల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందిస్తున్న వలంటీర్లు

కాయాల్సి వచ్చేది. గిరిజన గ్రామాల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఎక్కడో కిలోమీటర్ల దూరంలో ఉన్న డిపోకు నడుచుకుంటూ వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి రావడంతో గిరిజనులు ఇబ్బందులు పడేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు(ఎండీయూ) ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు చేరవేస్తుండడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాలకొండ నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాలకు సంబంధించి 54 మినీ ట్రక్కులు(ఎండీయూ) సమకూర్చారు.

ప్రజల కోసమే జగనన్న ప్రభుత్వం



ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోంది. బడుగుల, బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను అర్హుల ఇంటి వద్దకే చేరవేస్తోంది. గిరిజనుల కష్టాలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. రేషన్ సరుకుల కోసం ఎత్తైన కొండలు దిగి కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ డిపోకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకునేందుకు రోజుంతా వెచ్చించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. ఎండీయూ వాహనాల ద్వారా ప్రభుత్వమే లబ్ధిదారుల ఇంటి వద్దకు రేషన్ సరుకులు పంపిస్తోంది.

– విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్యే, పాలకొండ నియోజకవర్గం

మండలం	రేషన్ డిపోలు	కార్డుదారులు	ఎండీయూ వాహనాలు
పాలకొండ	63	22,919	16
భామిని	33	14,502	09
వీరఘట్టం	56	19,715	14
సీతంపేట	23	15,998	15

గ్రామ సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన


కిచ్చాడ గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

● ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల్లో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని కిచ్చాడ, బియ్యాలవలస, శివ్వన్నపేట గ్రామాల్లో రూ.1.42 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పరిపాలన తీసుకొచ్చారని అన్నారు. అన్ని ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలోనే అందుతున్నాయన్నారు. రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేందుకు రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీ రంగారావు, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, టి.వి.ఎస్.స్వామియాజులు, విద్యారాణి, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, గ్రామ సర్పంచ్‌లు గవర రాజ్యలక్ష్మి, గార్ల సుజాత, శెట్టి సురేష్, కళింగ వైశ్య, అయ్యరక కార్పొరేషన్ల డైరెక్టర్లు కొత్తకోట సురేష్, గవర విజయ్, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' పేదలకు వరం

వీరఘట్టం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం పేదలకు వరమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరానికి హాజరైన వారికి బిటివాడ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎమ్మెల్యే కళావతి శిబిరంలో రక్తపరీక్షలు చేయించుకున్నారు.


ఎమ్మెల్యే కళావతికి రక్త పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామానికి చెందిన లంక గోపినాథం మృతి చెందటంతో ఆయన భార్య లంక జయంతికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలను గ్రామ సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, ఎంపీటీసీ గుడారి విద్యారాణి బుధవారం అందజేశారు. మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనిమి ఇందిరాకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు రేవు సత్తిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మృతుని భార్యకు బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

భామిని: గ్రామదేవత ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై సీహెచ్ ప్రసాద్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో త్వరలో గ్రామ దేవతల ఉత్సవాలు ఉన్నందున బత్తిలి పోలీస్ స్టేషన్‌లో బుధవారం పలు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పండగలు జరుపుకోవాలని సూచించారు. జాతర నెపంతో అసాంఘిక కార్యకలాపాలు, నృత్యాలు, పాట్టేళ్ల పందేలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.


కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్సై ప్రసాద్

ప్రభుత్వ కళాశాలలోనే చేరాలి

గరుగుబిల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే ప్రవేశాలు పొందాలని పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని గరుగుబిల్లి, రావుపల్లి, కొత్తూరు తదితర జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉన్న వసతులు, కోర్సులు, ఇతర సౌకర్యాలను విద్యార్థులకు వివరించారు. దూరప్రాంత విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు అధ్యాపకులు టి.రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, సుకన్య, శాంతి, ధనలక్ష్మి, లక్ష్మణరావు తదితరులున్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులు

పంచగవ్య ద్రావణంతో తెగుళ్ల నివారణ

గుమ్మలక్ష్మీపురం: జీడిమామిడి పంటను ఆశించే తెగుళ్ల నివారణపై రైతులు దృష్టి సారించాలని ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం యూనిట్ ఇన్‌ఛార్జ్ కిమిడి భూషణరావు అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కళిగొట్టు గ్రామంలో జీడిమామిడి తోటలను బుధవారం పరిశీలించారు. పుల్లటి మజ్జిగ ద్రావణం, పంచగవ్య ద్రావణం పిచికారీతో జీడిమామిడిని ఆశించే తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. ఆయా ద్రావణాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. చిగురు, పూతదశలో ఉన్న జీడిమామిడి చెట్లపై ఆయా ద్రావణాలను పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ దీప ఉన్నారు.

ఎంపీడీఓగా అర్జునరావు

గరుగుబిల్లి: గరుగుబిల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా ఎన్.అర్జునరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ జి.పైడితల్లి శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో మండల పరిషత్ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న అర్జునరావుకు ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు.

గడువులోగా కులగణన పూర్తి

సీతానగరం: మండలంలో జరుగుతున్న కులగణన నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేలా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను సిద్ధం చేశామని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. పెదబోగిలి పంచాయతీలో ఉన్న సీతానగరం, అప్పయ్యపేట, బుడ్డిపేట, పెదబోగిలి గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు నిర్వహిస్తున్న కులగణనను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీరాజ్ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సహకారంతో ఇంటింటికీ వెళ్లి కులగణన కార్యక్రమం చేస్తున్నారన్నారు. కులాల ఆధారంగానే ఉపాధి, అభివృద్ధి పనులు కేటాయించడం జరుగుతుందన్నారు. పంచాయతీ ఈఓ జె.వెంకటరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అధ్యాపకులు 7 బృందాలుగా ఏర్పడి, పార్వతీపురం పరిసరాలలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వెళ్లి ప్రభుత్వ కళాశాల పార్వతీపురంలో జాయిన్ కావాలని 10వ తరగతి చదవుతున్న విద్యార్థులను అధ్యాపకులు కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.రవికుమార్, ఎస్.శ్రీనివాసరావు, సుకన్య, శాంతి, ధనలక్ష్మి, లక్ష్మణరావు, రామకృష్ణ, సత్యనారాయణ, శర్మ, శివ, కైలాష్, రవికాంత్, డీటీ నాయుడు, తేజ, వెంకటేశ్వరరావు, బాబ్జీరావ్ పాల్గొన్నారు.

క్షీరాభిషేకం


జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కూరాకుల, పొందర కుల నాయకులు

పాలకొండ: పట్టణంలో వడమ గ్రామంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి కూరాకుల సంఘ ప్రతినిధులు క్షీరాభిషేకం చేశారు. పొందర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజపు హైమావతి, అప్పన్న నేతృత్వంలో ఆయా సంఘాల సంయుక్త సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న ప్రభుత్వంలో వారికి జరిగిన సంక్షేమ లబ్ధిని గుర్తుచేసుకున్నారు. కమ్యూనిటీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తూముల లక్ష్మణరావు, కౌన్సిలర్ టి.కళావతి, తదితరులున్నారు.

ఇంజినీరింగ్ శాఖ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం


ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్‌శాఖ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతితో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎంపీపీ బి.ఆదినారాయణ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే కళావతి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో లోటుపాట్లపై అధికారులను ప్రశ్నించారు. దాసుగుమ్మడ–కుసుమూరు రహదారి పనులు పూర్తిస్థాయిలో చేయలేదని, కేవలం మెటీరియల్ వేసి వదిలేశారని ఎంపీటీసీ కోటేశ్వరరావు, సర్పంచ్ వెంకునాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పనులు చేయకుండా రూ.50 లక్షల నిధులు ఎలా చెల్లించారని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. పనులు చేయించలేకపోతే సెలవు పెట్టి వెళ్లిపోండని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేరే కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదని డీఈ కృష్ణకుమార్, ఏఈ నాగభూషణం తెలిపారు. పనులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేవనాపురం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో లబ్ధిదారులకు సకాలంలో పౌష్టికాహారం పంపిణీ చేయకపోవడంపై వైస్ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అధికారులను నిలదీశారు. ఏజెన్సీలో మరోసారి భూముల సర్వే చేయించాలని సర్పంచ్‌లు హెచ్.ఆదిలక్ష్మి, జె.సుందరమ్మ కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ మ్యూటేషన్లు, ఇతర సమస్యలపై చర్చించాలని ఎంపీపీ ఆదినారాయణ డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్ర ప్రసాద్‌కు సూచించారు. చేపల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మత్స్యకార సొసైటీలు ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. సబ్సిడీపై గిరిజన రైతులకు యంత్రపరికరాలు సప్లై చేయాలని ఎంపీటీసీ హరిబాబు కోరగా.. హార్టికల్చర్ ద్వారా అందిస్తున్నారని వ్యవసాయాధికారి శ్రీదేవి సమాధానమిచ్చారు. ఆరోగ్యశ్రీ కార్డులు, సికిల్‌సెల్ ఎనీమియా రక్తపరీక్షల వంటి వాటిపై మర్రిపాడు, దోనుబాయి వైద్యాధికారులు సాయిచరణ్, భానుప్రతాప్ వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎస్.లక్ష్మి, ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్డీ కె.సత్యం, సీడీపీఓ రంగలక్ష్మి, ఎంఈఓ ఆనందరావు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

గరుగుబిల్లి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వారికి సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. మండలంలోని చినగుడబ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వెంగళ శ్రీధర్‌రావు సన్మానసభ మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పరీక్షిత్‌రాజు.. శ్రీధర్‌రావు, సీతాలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ వయసుకే కానీ, మనసుకు కాదని, శేష జీవితాన్ని కుటుంబంతో ఆనందంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, ఎంఈఓలు ఎస్.నాగభూషణరావు, కొండలరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


శ్రీధర్‌రావు దంపతులను సన్మానిస్తున్న పరీక్షిత్‌రాజు

ఎంపీడీఓకు సన్మానం

గుమ్మలక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయిన ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజును పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం ఉద్యోగులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు బుధవారం సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, తదితరులు పాల్గొని ఎంపీడీఓ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వైకేపీ, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో పాటు ఈఓపీఆర్డీ జగదీష్ కుమార్, పలువురు సర్పంచ్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


సాల్మన్‌రాజు దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, తదితరులు

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

జియ్యమ్మవలస: మండలంలోని తాళ్లదుమ్మ పంచాయతీ చంద్రశేఖరరాజపురంలో చినమేరంగి ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన ప్రత్యేక శిబిరాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గణపతి మహరాణా పాల్గొని గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అంటురోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ సంజయ్‌కుమార్ ఛౌడ, డి.గౌరీశంకర్, నగేష్, పాఠశాల హెచ్‌ఎం శివ, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గణపతి మహరాణా

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

● ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి
● సీతంపేటలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సీతంపేటలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులు ఇచ్చి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి చేకూర్చిన లబ్ధిని తెలియజేసే బుక్‌లెట్లు అందజేశారు. స్థానికుల నుంచి అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఏ ఇంటికి వెళ్లిన వారంతా సంక్షేమ పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకున్నామని ఆనందంగా చెపుతున్నారని అన్నారు. ప్రతీ ఇంటికి మేలు చేసిన సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీటీసీ ఎస్.లక్ష్మి, ఎంపీడీఓ కె.గీతాంజలి, సర్పంచ్‌లు ఎ.కళావతి, హెచ్.ఆదిలక్ష్మి, సుందరమ్మ, తిరుపతిరావు, ఎంపీటీసీ జి.పగడాలమ్మ, హరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, ప్రకాశరావు, పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల లబ్ధిపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

3న వైఎస్సార్ ఆసరా సభ

సీతంపేట: స్థానిక ఐటీడీఏ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఈ నెల 3న వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళలు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.